మణిని చూచికాపు అపుడు
పట్టలేని ఆనందము పొంది
చెట్టువిడిచి కదిలిపోయె
మరుచటిదినం మరల చేరెను

ఎప్పటిలా పసిడిపిట్ట
మణితెచ్చి మరల యిచ్చె
ప్రతి దినము కట్టెలవాడు
మణిని పొంది ధనికుడాయె

దురాశతోడమాటు కాసి
పిట్టనపుడు పట్టుకొనియె
పొట్టలోన మణులున్నవని
పీకపిసికి కడుపుకోసె

అందు చూడ ఏమి కలదు
అంతం లేని కలతనొంది
బోరుబోరున ఏడ్చుకొంటు
లబోదిబోమని తిరిగిపోయె

# స్వచ్ఛభారత్

రండి పిల్లలూ
రండి...!
పుస్తకం కలం పక్కన బెట్టి
చీపుళ్ళను మన చేతబట్టి
ఉండే ఊరిని మన ఇల్లనుకుని
శుభ్రం చేద్దామండీ...
పరిశుభ్రం చేద్దామండీ...
మహాత్ముడు చెప్పినా
మన ప్రధాని చెప్పినా
శుచీ శుభ్రతకే ప్రాధాన్యం
అందులోనే ఉంది ఆరోగ్యం
ఆరోగ్యమే కదండీ మహాభాగ్యం
అందుకే చెయ్యాలి శ్రమదానం
మన చిట్టి చేతులకి
జత కలుస్తాయి మరెన్నో పెద్ద చేతులు
దేశానన్ని అందంగా తీర్చిదిద్దుతాయి
ప్రతిష్టనూ పెంచుతాయి!

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు
సికింద్రాబాద్